మాట్లాడుతూ ప్రస్తుతం రెండు నెలల పోరాటం తర్వాత కొంత విశ్రాంతి తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. త్వరలోనే తమ తదుపరి కార్యాచరణను అధికారికంగా ప్రకటిస్తామని విద్యా వ్యవస్థ ప్రక్షాళన కోసం తమ ప్రయాణం ఆగదని వెల్లడించారు. కేవలం ఒక రాష్ట్రానికి పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న పబ్లిక్ సర్వీస్ కమిషన్ల లోపాలను ఎత్తిచూపేందుకు సరికొత్త వ్యూహాలను రచిస్తున్నారు. తెలంగాణ రాజస్థాన్ ఉత్తరప్రదేశ్ బీహార్ లాంటి అనేక రాష్ట్రాలలో గతంలో జరిగిన పేపర్ లీకేజీ ఉదంతాలు మరోసారి తెరపైకి వస్తున్నాయి. కేవలం ఒక శాఖపై పోరాడి విజయవంతం అయినంత మాత్రాన సరిపోదని అన్ని రాష్ట్రాల బోర్డులను ప్రక్షాళన చేయాలని డిమాండ్లు వస్తున్నాయి. ఉద్యోగ వేటలో ఉన్న నిరుద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎత్తిచూపుతూ సీజేపీని ఆశ్రయిస్తున్నారు. అయితే రాష్ట్రాల్లో కూడా ప్రత్యక్ష ఆందోళనలు ప్రారంభించాలా వద్దా అనేదానిపై ఆ పార్టీ నాయకత్వం తీవ్రంగా మథనపడుతోంది. ఇప్పటివరకు జాతీయ స్థాయి సమస్యలపై పోరాడిన అనుభవం ఉండగా ఇకపై ప్రాంతీయ రాజకీయాలను కూడా ఎదుర్కొనే దిశగా అడుగులు వేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తును అస్తవ్యస్తం చేస్తున్న మాఫియాపై ఉక్కుపాదం మోపేలా నిరసనల రూపురేఖలను మార్చాలని భావిస్తున్నారు. ఈ పరిణామాలపై స్పందించిన పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ రాష్ట్రంలో ఎలాంటి లీకేజీలు జరగలేదని ఖండించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు అవుతున్నప్పటికీ ఒక్క ప్రశ్నాపత్రం కూడా లీక్ కాలేదని ఆయన స్పష్టం చేశారు. అయితే ఇటీవల కొందరు వ్యక్తులు బ్లూటూత్ పెన్నులను ఉపయోగించి డిజిటల్ పద్ధతిలో కాపీయింగ్ చేసేందుకు కుట్ర పన్నారని తెలిపారు. పరీక్ష ప్రారంభమైన కేవలం పది నిమిషాల్లోనే ఈ మోసాన్ని పసిగట్టిన అధికారులు వెంటనే రంగంలోకి దిగి ఆ ముఠాను అణచివేశారని పేర్కొన్నారు. ఒక్కో పేపర్‌కు మూడు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయలు వసూలు చేస్తూ బయటి నుంచి ఈ కుట్రను నడిపిస్తున్న సూత్రధారులను పట్టుకున్నామని చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి మొత్తం ఇరవై ఒక్క మంది నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపామని పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. సీజేపీ చీఫ్ అభిజీత్ దీప్కే ఎక్స్ వేదికగా ఒక ప్రత్యేక వీడియో సందేశాన్ని విడుదల చేస్తూ ఇది కేవలం ఆరంభం మాత్రమేనని తేల్చిచెప్పారు. తమ ప్రయాణం ముగియలేదని ఇంకా చాలా దూరం వెళ్లాల్సి ఉందని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయడం తమ డిమాండ్లను అంగీకరించడంతో ప్రస్తుతానికి నిరసనను విరమించామని తెలిపారు. గత ముప్పై ఏడు రోజులు తన జీవితంలో అత్యంత కఠినమైనవని ఎలాంటి టెన్షన్ లేకుండా రాత్రి ప్రశాంతంగా నిద్రపోయి ఉదయం లేవడం చాలా కాలం తర్వాత జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. జంతర్ మంతర్ వద్ద చలిని లెక్కచేయకుండా పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. తమను విమర్శించిన వారి వల్లే మరింత మెరుగ్గా పని చేసే అవకాశం లభించిందని వారికి కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. దేశంలోని ప్రతి విద్యార్థికి న్యాయం జరిగే వరకు విద్యా వ్యవస్థలో సంస్కరణలు వచ్చే వరకు తమ పోరాటం నిరంతరం సాగుతూనే ఉంటుందని దీప్కే పునరుద్ఘాటించారు. కేవలం ఒక పదవి నుంచి మంత్రి దిగిపోవడంతో సమస్య పూర్తిగా పరిష్కారం కాదని పరీక్షల నిర్వహణ పద్ధతులు పూర్తిగా మారాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీలకు పాల్పడే మాఫియా వెనుక ఉన్న పెద్ద తలకాయలను చట్టం ముందు నిలబెట్టే వరకు విశ్రమించేది లేదని హెచ్చరించారు. సోషల్ మీడియా ద్వారా వస్తున్న మద్దతును చూస్తుంటే రాబోయే రోజుల్లో ఈ ఉద్యమం మరింత ఉధృత రూపం దాల్చే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం ఢిల్లీ కేంద్రంగానే కాకుండా దేశంలోని ప్రతి నూతన మూలకు ఈ విప్లవాన్ని తీసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. యువతకు అన్యాయం జరిగే ప్రతిచోటా తాము అండగా ఉంటామని సీజేపీ స్పష్టం చేయడంతో రాబోయే కాలంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు కూడా తమ పనితీరును మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు కేవలం నిరసనలకే పరిమితమైన ఈ వేదిక ఇప్పుడు దేశ రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగింది. నిరుద్యోగుల గొంతుకగా మారి ప్రభుత్వాలను ప్రశ్నిస్తున్న ఈ కొత్త ట్రెండ్ రాబోయే కాలంలో ఏయే రాష్ట్రాలకు పాకుతుందనేది తీవ్ర ఆసక్తిని కలిగిస్తోంది. ఏది ఏమైనప్పటికీ విద్యా రంగాన్ని ప్రక్షాళన చేయాలనే నినాదం దేశవ్యాప్తంగా యువతను ఏకం చేయడంలో కీలక పాత్ర పోషిస్తోంది.



## టీజేఎస్ డబ్ల్యూ ఆర్ శంషాబాద్ యాచారం జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

- **టీజే ఎస్ డ బ్ల్యుఆర్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు**

**విశాల భారతి ఇబ్రహీంపట్నం**



ఎస్ఎస్ సి ఉత్తీర్ణులైన ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థులకు , ఎస్ఎస్సి 2026 ఉత్తీర్ణులైన ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థులకు సువర్ణ అవకాశమని ప్రిన్సిపల్ నాగేశ్వరరావు తెలిపారు. ఇంటర్మీడియట్ సిఇసి ఒకేషనల్, ఎల్ ఎం ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. 400 కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులే అర్హులని పేర్కొన్నారు.

**ప్రవేశ తేదీ:**

29072026 (బుధవారం)
ఉదయం 10:00 గంటలకు
వేదిక టి.జె.ఎస్. డబ్ల్యూ.ఆర్.ఎస్ జూనియర్ కళాశాల (బాలురు), శంషాబాద్, యాచారం మండలం.

**రావలసిన ధృవపత్రాలు:**

ఎస్ఎస్సి మెమో, ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్ టిసి, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, నివాస ధృవీకరణ పత్రం ఇవ్వాలని కోరారు.

**ప్రత్యేక సౌకర్యాలు**

ఉచిత విద్య & వసతి, ఒకేషనల్ (ఏటి / ఎల్ ఎం ) నైపుణ్య కోర్సులు, అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ, సుసంపన్నమైన కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు.ఈ ప్రవేశాలు పూర్తిగా అర్హత, నియమాలు అందుబాటులో ఉన్న సీట్ల ఆధారంగా నిర్వహించబడతాయి.

**మరిన్ని వివరాలకు ఈ ఫోన్ నెంబర్కు 7995010641 ఫోన్ చేయాలి.**

# శంషాబాద్‌లో వ్యక్తి గల్లంతు కేసు నమోదు

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి గల్లంతైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముచింతల్ గ్రామానికి చెందిన మొహమ్మద్ సాదిక్ (25), ఆటో డ్రైవర్, తన తండ్రి పకీర్ జాంగీర్ (55) గల్లంతయ్యాడని ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, జూలై 23వ తేదీ ఉదయం సుమారు 8 గంటల సమయంలో పకీర్ జాంగీర్ తన భార్య చాంద్ బీతో కలిసి టీవీఎస్ ఎక్స్ఎల్ బైక్ (TG07C4144)పై ఆకుకూరలు తీసుకుని శంషాబాద్ కూరగాయల మార్కెట్‌కు వెళ్లారు. అక్కడ పని ఉందని చెప్పి పకీర్ జాంగీర్‌ను ఇంటికి వెళ్లమని భార్య సూచించింది. అదే రోజు ఉదయం 11 గంటల సమయంలో చాంద్ బీ ఇంటికి చేరుకుని చూసేసరికి ఆయన ఇంటి వద్ద కనిపించలేదు. ఫోన్ చేయగా స్పందించలేదు. అదే రోజు రాత్రి 10 గంటల సమయంలో పకీర్ జాంగీర్ బస్సులో ఇంటికి వచ్చాడు. అయితే అతని వద్ద బైక్, మొబైల్ ఫోన్ లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆ విషయమై ప్రశ్నించగా, అతనికి గుర్తు లేదని చెప్పి నిద్రపోయాడు. తరువాత రోజు జూలై 24 ఉదయం కుటుంబ సభ్యులు మళ్లీ అడిగినప్పటికీ, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. బంధువులు, పరిచయస్తులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఎలాంటి సమాచారం లభించలేదు. ప్రస్తుతం అతని మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. గల్లంతైన పకీర్ జాంగీర్ ఎత్తు 5 అడుగులు 6 అంగుళాలు, చామనచాయ రంగు కలిగి ఉంటాడు. చివరిసారిగా వైట్ కలర్ టీషర్ట్, గ్రే ప్యాంట్, బ్రౌన్ రెయిన్ కోట్ ధరించి ఉన్నాడు. తెలుగు, హిందీ భాషలు మాట్లాడగలడు. అతనికి మద్యం తాగే అలవాటు ఉండటంతో పాటు మతిమరుపు సమస్య కూడా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఫిర్యాదు స్వీకరించిన శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నారు.

**ఇట్లు**
**వై. సురేందర్ రెడ్డి**
**ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్**
**పోలీస్ స్టేషన్, శంషాబాద్ (ఫ్యూచర్ సిటీ)**

# కర్ణాటక కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన పిడిఎస్యు తెలంగాణ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:**

దేశంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో అమలవుతున్న ఉన్నత విద్యా విధానాలు, పరిశోధనా అవకాశాలు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలనే ఉద్దేశంతో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్యు తెలంగాణ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ సోమవారం కర్ణాటక రాష్ట్రంలోని కలబురగిలో ఉన్న కర్ణాటక కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలోని వివిధ విద్యా విభాగాలు, ఆధునిక గ్రంథాలయం, పరిశోధనా కేంద్రాలు, సాంకేతిక విద్యా వనరులు, విద్యార్థుల వసతి గృహాలు, ప్రయోగశాలలు, క్రీడా మైదానాలు, ఇతర మౌలిక సదుపాయాలను ఆయన పరిశీలించారు. విశ్వవిద్యాలయంలో నెలకొన్న ప్రశాంతమైన విద్యా వాతావరణం, పరిశుభ్రమైన ప్రాంగణం,



పరిశోధనకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా బానోత్ దేవేందర్ మాట్లాడుతూ, దేశ ప్రగతికి ఉన్నత విద్యే బలమైన పునాదని అన్నారు. విద్యార్థులు కేవలం విద్యార్హతలు సాధించడానికే పరిమితం కాకుండా విజ్ఞానాన్ని పెంపొందించుకోవడం, పరిశోధనల పట్ల ఆసక్తి పెంచుకోవడం, రాజ్యాంగ విలువలను కాపాడడం, శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవడం, సామాజిక బాధ్యతతో ముందుకు సాగడం అత్యంత అవసరమని సూచించారు. దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ఒకే విద్యా వేదికపై కలిసి చదువుకుంటూ జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలుస్తున్న ఈ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉన్నత విద్యారంగంలో విశిష్ట స్థానాన్ని సంపాదించిందని ఆయన పేర్కొన్నారు. భిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాల మధ్య పరస్పర అవగాహన పెంపొందించడంలో ఇటువంటి విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. నేటి యువత పరిశోధనలు, ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక చైతన్యంతో ముందుకు సాగితేనే దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించగలరని ఆయన పేర్కొన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో అందుబాటులో ఉన్న ఆధునిక విద్యా వనరులు, పరిశోధనా అవకాశాలు, గ్రంథాలయ సౌకర్యాలు, విద్యార్థి సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థి ఉద్యమాలు కేవలం సమస్యల పరిష్కారానికే పరిమితం కాకుండా నాణ్యమైన విద్య, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతరం పోరాడాలని ఆయన అన్నారు. దేశంలోని వివిధ ఉన్నత విద్యాసంస్థలను సందర్శించడం ద్వారా విద్యార్థులకు విద్యా విధానాలు, పరిశోధనా అవకాశాలు, భవిష్యత్ అవకాశాలపై విస్తృత అవగాహన ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు.

## కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం – నార్సింగిలో కలకలం

**గుర్తింపుకు ప్రజల సహకారం కోరిన పోలీసులు**

**రాజేంద్రనగర్, విశాల భారతి :** నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖానాపూర్ గ్రామం సమీపంలోని కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమవడంతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, 27 జూలై 2026న పర్యవేక్షణలో ఉన్న సమయంలో డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందింది. ఖానాపూర్ గ్రామంలోని కాలువలో ఒక వ్యక్తి మృతదేహం కనిపించిందని సమాచారం రావడంతో వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడ సుమారు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు గల గుర్తుతెలియని పురుషుడి మృతదేహం కాలువలో ఉన్నట్లు గుర్తించారు. మృతుడు నలుపు రంగు టీషర్ట్, తెలుపు రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. అతని ఎడమ చేతిపై టాటూ ఉండటం గమనార్హం. ఈ లక్షణాల ఆధారంగా మృతుడి గుర్తింపును సులభతరం చేయాలని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రి మోర్చ్యువరీకి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడిని ఎవరైనా గుర్తించినట్లయితే లేదా సంబంధిత సమాచారం ఉన్నవారు వెంటనే నార్సింగి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. డయల్ 100 లేదా 112 నంబర్లకు కూడా సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పోలీసులు స్పష్టం చేశారు.

## ఎల్‌బీ నగర్‌లోనూ ఇందిరమ్మ టవర్స్ అమలు చేయాలి

**జోనల్ కమిషనర్‌కు బీజేపీ నాయకుల వినతిపత్రం**




**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :** రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అమలు చేయనున్న ఇందిరమ్మ టవర్స్ పథకంలో ఎల్‌బీ నగర్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని కూడా చేర్చి, పేదలు, దిగువ మధ్యతరగతి కుటుంబాల సొంత ఇంటి కలను సాకారం చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు గ్రేటర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఎల్‌బీ నగర్ జోన్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో (ఐఏఎస్)కు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ ఎల్‌బీ నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మేడ్చల్ రూరల్ జిల్లా ప్రభారి సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్లు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, నాయికోటి పవన్ కుమార్, వివిధ డివిజన్ల అధ్యక్షులు, పార్టీ నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌బీ నగర్ నియోజకవర్గంలో వేలాది పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలు సొంత ఇంటి కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నాయని, అందువల్ల ఇందిరమ్మ టవర్స్ పథకాన్ని వెంటనే ఎల్‌బీ నగర్‌లో అమలు చేసి అర్హులైన లబ్ధిదారులకు గృహాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు ఎరుకల మల్లేష్ గౌడ్‌తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేవైఎం లో నూతన జోష్... అభినయ్ గౌడ్ చేతుల్లో రంగారెడ్డి జిల్లా నాయకత్వం!

**చేవెళ్ల బీజేవైఎం నేతల ఘన సత్కారం**



**చేవెళ్ల, విశాల భారతి :** రంగారెడ్డి జిల్లాలో బీజేవైఎం కార్యకలాపాలకు నూతన దిశానిర్దేశం లభించింది. నూతనంగా జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అభినయ్ గౌడ్ గారిని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. వైభవ్ రెడ్డి గారితో కలిసి చేవెళ్ల మున్సిపల్ బీజేవైఎం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన నాయకులు, అభినయ్ గౌడ్ గారి నాయకత్వం యువతకు నూతన ఉత్సాహాన్ని నింపుతుందని పేర్కొన్నారు. ఆయన అనుభవం, కృషి, పట్టుదలతో బీజేవైఎంను గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు మరింత బలోపేతం చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇక అభినయ్ గౌడ్ మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. యువతను పెద్దఎత్తున సంస్థలోకి తీసుకువచ్చి, బీజేవైఎంను మరింత శక్తివంతంగా తీర్చిదిద్దడం తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాటాలు చేస్తామని, ప్రతి కార్యకర్తను నాయకుడిగా తీర్చిదిద్దే దిశగా కృషి చేస్తామని అన్నారు. మొత్తంగా ఈ కార్యక్రమం బీజేవైఎంలో కొత్త ఉత్సాహానికి నాంది పలికినట్టుగా కనిపించింది. జిల్లా వ్యాప్తంగా యువశక్తిని సమీకరించి పార్టీని మరింత ఎత్తులకు తీసుకెళ్లాలనే సంకల్పంతో నాయకులు ఏకమయ్యారు.

## హరితహారం కాలనీలో సీసీ రోడ్డు పనుల పరిశీలన

**రూ.10 లక్షల అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ కౌన్సిలర్ బొర్ర అనురాధ సురేష్**



**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :** నాగోల్ సర్కిల్ పరిధిలోని 52వ డివిజన్ పెద్ద అంబర్‌పేట్ హరితహారం కాలనీలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే శ్రీ మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో చేపట్టిన రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను తాజాగా మాజీ కౌన్సిలర్ బొర్ర అనురాధ సురేష్ కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో చేపడుతున్న అభివృద్ధి పనుల నాణ్యతపై స్థానికులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక చొరవతో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కాలనీ అవసరాలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కాలనీ పెద్దలు, నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ ఆత్మగౌరవ భవనానికి 50 లక్షల రూపాయలు విరాళం

**ముషీరాబాద్, విశాల భారతి:** ఉప్పల్ భగాయత్ లో విశ్వకర్మ ఆత్మగౌరవ భవనానికి మొదటి అంతస్థ నిర్మాణం కోసం కీర్తిశేషులు నిర్మల సూర్యరాజు జ్ఞాపకార్థం జి ఆర్ సూర్య రాజు 50 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆత్మగౌరవ భవన్ ప్రతినిధులు వేములవాడ మదన్మోహన్, బొడ్డుపల్లి సుందర్ తో కలిసి బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి హాజరై సోమవారం నిర్మాణ పనుల కోసం విశ్వకర్మ భగవాన్ కి పూజ చేసి శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ విరాళం విశ్వకర్మల జాతికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుభాష్, వెంకట చారి, తాటికొండ శ్రీరాములు, రమేష్, కృష్ణమాచారి, కిషన్ రావు, సంజయ్, బంగారు కొండయ్య, ప్రశాంత్, రామకృష్ణ, రవీందర్ నాథ్, బలవంత చారి, యాదగిరి, శ్రీనివాస చారి, మారోజు వెంకట్, సతీష్ చారి తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ పోలీస్ అకాడమీలో ప్రొబేషనరీ డీఎస్పీలకు గుర్రపు స్వారీ శిక్షణ ప్రారంభం

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 112 మంది ప్రొబేషనరీ డిప్యూటీ సూపరింటెండెంట్స్ ఆఫ్ పోలీస్ కోసం మూడు వారాల ప్రత్యేక ఈక్వెస్ట్రియన్ (హార్స్ రైడింగ్ ) శిక్షణ కార్యక్రమం నేటి నుండి హైదరాబాద్ నగరంలోని సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ మౌంటెడ్ పోలీస్ విభాగంలో ఘనంగా ప్రారంభమైంది. భవిష్యత్ పోలీసు నాయకత్వాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ శ్రీమతి అభిలాష్ బిస్త్, ఐపీఎస్ ప్రత్యేక చొరవతో ఈ వినూత్న శిక్షణను ప్రవేశపెట్టారు. గుర్రపు స్వారీ ద్వారా శారీరక దృఢత్వం, మానసిక సమతుల్యత, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, వేగవంతమైన నిర్ణయ సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే కాకుండా, క్లిష్ట పరిస్థితుల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశ్యంగా ఉంది. ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న 112 మంది శిక్షణార్థులను మూడు బ్యాచ్‌లుగా విభజించి, ఒక్కో బ్యాచ్‌కు వారం రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం వేళల్లో సిటీ మౌంటెడ్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో ప్రాక్టికల్ శిక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా అవుట్ డోర్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ టి. భరత్ మాట్లాడుతూ, భారీ ఎత్తున ప్రజలు హాజరయ్యే ఉత్సవాలు, మతపరమైన వేడుకలు, ర్యాలీలు, నిరసనలు, వీఐపీ బందోబస్తులు వంటి సందర్భాల్లో మౌంటెడ్ పోలీసింగ్ అత్యంత సమర్థవంతమైన ప్రజా నియంత్రణ సాధనంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈక్వెస్ట్రియన్ శిక్షణ ద్వారా అధికారులు ప్రజలతో మరింత సమర్థవంతంగా వ్యవహరించడమే కాకుండా, క్లిష్ట పరిస్థితుల్లో ధైర్యంగా, వేగంగా నిర్ణయాలు తీసుకునే నాయకత్వ లక్షణాలను కూడా అలవర్చుకుంటారని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని అవుట్ డోర్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ యార్లగడ్డ రాంబాబు నేతృత్వంలో సమన్వయం చేస్తున్నారు. ప్రారంభ కార్యక్రమంలో మౌంటెడ్ పోలీస్ వింగ్‌కు చెందిన ఏసీపీ కిషన్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ నరేష్, టీజీపీఏ డీఎస్పీలు తోట శ్రీనివాసులు, తిరుపతి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ ప్రవీణ్, అవుట్ డోర్ విభాగానికి చెందిన డీఐలు, ఏడీఐలు, సిటీ మౌంటెడ్ పోలీస్ అధికారులు మరియు శిక్షణార్థులు పాల్గొన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీ పోలీసు శిక్షణలో ఆధునిక ప్రమాణాలను ప్రవేశపెడుతూ, శారీరక, మానసిక, నాయకత్వ నైపుణ్యాలను సమన్వయం చేసే ఇటువంటి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల ద్వారా భవిష్యత్ పోలీసు అధికారులను సమగ్రంగా తీర్చిదిద్దే దిశగా మరో ముందడుగు వేసింది.



## విద్యార్థుల భవిష్యత్తుకు చట్టపరమైన రక్షణ

**బి.జె.పి మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్**

**సికింద్రాబాద్, విశాల భారతి :**



ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నందన్ నీలకని నేతృత్వంలో ఆరుగురు మేధావులతో కూడిన హైపవర్డ్ టాస్క్ ఫోర్స్ ను నియమించి లీకేజీలపై ఉక్కు పాదం మోపడానికి ప్రివెన్షన్ ఆఫ్ అన్ ఫెయిర్ మీన్స్ 2026 సవరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్ట నుందని మాజీ కార్పొరేటర్ సరూప గౌడ్ తెలిపారు. పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టేందుకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2024లో "పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) చట్టం 2024" ను తీసుకువచ్చిందని యూపీఏ ప్రభుత్వ హయాంలో దేశవ్యాప్తంగా అనేక పరీక్షా లీకేజీలు జరిగినప్పటికీ, ఇలాంటి కఠినమైన చట్టాన్ని తీసుకురాలేకపోయారని మోదీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చట్టపరమైన రక్షణ కల్పించిందని మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ అన్నారు. పరీక్షల నిర్వహణను మరింత పారదర్శకంగా, నిష్పాక్షికంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిపుణులతో కూడిన రాధాకృష్ణ కమిటీ సిఫార్సుల మేరకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ లో పలు సంస్కరణలు చేపట్టిందని స్వరూప గౌడ్ అన్నారు. అధికారుల నిర్లక్ష్యం ఇతర కారణాల వల్ల లోపాలు జరిగిన నేపథ్యంలో బాధ్యులపై చర్యలు తీసుకుంటూ, దాదాపు 47 మంది అధికారులను బదిలీ చేసిందని . తప్పు చేసిన వారిని ఉపేక్షించబోమనే సంకల్పాన్ని కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా చాటిందని స్వరూప గౌడ్ అన్నారు. ప్రస్తుతం 2024 చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ పార్లమెంట్ లో సవరణలు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని . ఈ సవరణలతో పరీక్షా పత్రాల లీకేజీ, అవకతవకలకు పాల్పడిన వారిపై మరింత కఠిన చర్యలు తీసుకునేలా చట్టాన్ని బలోపేతం చేస్తున్నారని స్వరూప గౌడ్ అన్నారు . ఈ చట్టం పరిధిలో యూపీఎస్సీ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ , రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే పరీక్షలతో పాటు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే అన్ని ప్రజా పరీక్షలు ఉంటాయని పరీక్షా పత్రాల లీకేజీ లేదా ఇతర అక్రమాలకు పాల్పడిన వారికి కనీసం 10 సంవత్సరాల జైలు శిక్ష విధించేలా చట్టాన్ని మరింత కఠినతరం చేస్తున్నారని అలాగే ఇప్పటివరకు ఉన్న రూ.1 కోటి జరిమానాను రూ.15 కోట్ల వరకు పెంచే ప్రతిపాదన తీసుకొచ్చారని బిజెపి మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ అన్నారు. పరీక్షా లీకేజీ కేసుల విచారణను వేగవంతం చేయడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి, నాలుగు నెలల్లోపు దర్యాప్తు పూర్తిచేసి చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా వ్యవస్థను బలోపేతం చేస్తున్నారని స్వరూప గౌడ్ అన్నారు. ఇటీవల జరిగిన పరిణామాల్లో కూడా కేంద్ర ప్రభుత్వం మొదటిసారిగా ఆందోళన చేస్తున్న విద్యార్థి ప్రతినిధులతో చర్చలు జరిపి, వారి అభిప్రాయాలను విని, సానుకూల వాతావరణాన్ని నెలకొల్పేందుకు చర్యలు తీసుకుందని సమస్యల పరిష్కారానికి సంభాషణ ద్వారానే ముందుకు సాగాలనే కేంద్ర ప్రభుత్వ వైఖరి మరోసారి స్పష్టమైందని స్వరూపగౌడ్ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడే దిశగా, ప్రజా పరీక్షల విశ్వసనీయతను మరింత బలోపేతం చేసే ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని స్వరూప గౌడ్ అన్నారు.

## వేదికగా అథ్లెటిక్స్ పోటీల హోరాహోరీ పోటీలు




- **మణికొండ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల సత్తా – హరినాథ్ రెడ్డి నాలుగు పతకాలతో మెరిసిన ప్రతిభ**
- **విజేతలకు నగదు ప్రోత్సాహం – క్రీడా సామగ్రితో ప్రోత్సహించిన దాతలు**

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

నగరంలోని ఓస్మానియా యూనివర్సిటీ క్రీడా మైదానంలో జూలై 25, 2026న నిర్వహించిన గ్రేటర్ హైదరాబాద్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లు అత్యంత ఉత్సాహభరితంగా, పోటీ పరాకాష్టకు చేరుకున్నాయి. నగరంలోని పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక పోటీల్లో మణికొండ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పలు పతకాలను కైవసం చేసుకున్నారు. ముఖ్యంగా ఎస్. హరినాథ్ రెడ్డి అద్భుత ప్రతిభ ప్రదర్శిస్తూ నాలుగు పతకాలను సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. అతని ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. ఇదే విధంగా ఏ. ప్రవీణ్, కె. విజయ్, వై. అభిలాష్‌కూడా తమ తమ విభాగాల్లో మెరుగైన ప్రదర్శన కనబరిచి పతకాలు సాధించారు. ఈ విజయాలతో జెడ్పీహెచ్ఎస్ మణికొండ క్రీడా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. విజేతల కృషిని అభినందిస్తూ ప్రముఖులు ముందుకు వచ్చి ప్రోత్సాహం అందించారు. రామకృష్ణ రెడ్డి విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాన్ని అందించి వారిని అభినందించారు. అలాగే గంగాధర్ రావు హరినాథ్ రెడ్డికి ట్రాక్‌సూట్లు, ఇతర క్రీడా సామగ్రిని అందజేసి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఘనంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు , శివ గంగా, ఇతర ప్రముఖులు పాల్గొని విజేతలను సత్కరించారు. విద్యార్థుల కృషి, పట్టుదల, శిక్షణ ఫలితంగా ఈ విజయాలు సాధ్యమయ్యాయని వారు కొనియాడారు. అదేవిధంగా రామకృష్ణ రెడ్డి భవిష్యత్తులో కూడా క్రీడాకారులకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ విజయాలతో మణికొండ జెడ్పీ హెచ్ఎస్ విద్యార్థులు తమ ప్రతిభను మరింత ఎత్తుకు తీసుకెళ్లే దిశగా ముందుకు సాగుతున్నారని, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా విజయాలు సాధించాలని పాఠశాల సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేశారు.

## పద్మశాలి సంఘ బలోపేతమే లక్ష్యంగా తొలి సమావేశం

**అధ్యక్షులు - మంద జగన్**



**సికింద్రాబాద్, విశాల భారతి :** పద్మశాలి సంఘ బలోపేతమే లక్ష్యంగా తొలి సమీక్ష సమావేశం నిర్వహించామ ని అధ్యక్షులు మంద జగన్ ఆన్నారు. ఈ సమావేశంలో సంఘ బలోపేతం, సభ్యుల ఐక్యత, భవిష్యత్ సేవా కార్యక్రమాలు, సామాజిక అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం జనరల్ సెక్రటరీ రాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.... సమాజ అభ్యున్నతి కోసం ప్రతి సభ్యుడు సేవా భావంతో పనిచేయాలని సూచించారు. యువతను సంఘ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడంతో పాటు విద్య, ఉపాధి, సామాజిక సేవలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు . ఈ సందర్భంగా అధ్యక్షులు మంద జగన్ మాట్లాడుతూ.... సికింద్రాబాద్ పద్మశాలి సంఘాన్ని మరింత బలోపేతం చేసి, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. కార్యవర్గ సభ్యులందరి సహకారంతో సంఘాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో సభ్యులు చింతకింది మల్లేష్, భోగ సంజీవ్ కుమార్, ఒగ్గు శ్రీధర్, గబ్బెట రాజు, చేరుపల్లి శ్రీకాంత్, వెల్దండ సాయి, చింతకింది సాయి కిరణ్, శ్యామల శివ, ఆనందాస్ కరుణాకర్, తౌటం సతీష్, కర్నాటి ఆనంద్, వెల్లండి శ్రీకాంత్, పులి శివకుమార్, ఆమంచ రాము, తిరుమల రవి తదితరులు పాల్గొని సంఘ అభివృద్ధికి తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. సమావేశం అనంతరం సభ్యులందరూ సంఘ ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని తీర్మానించారు.

## నార్సింగి హైట్స్‌లో సీసీ రోడ్ పనులకు శ్రీకారం

**ఎమ్మెల్యే సహకారంతో ఏఎంసీ చైర్మన్ కోట వేణుగౌడ్ ప్రారంభం**




**రాజేంద్రనగర్, విశాల భారతి :** నార్సింగి హైట్స్ ప్రాంతంలో అభివృద్ధి పనులకు వేగం పెరుగుతోంది. గౌరవ ఎమ్మెల్యే గారి సహకారంతో ఏఎంసీ చైర్మన్ కోట వేణుగౌడ్ గారు సీసీ రోడ్ పనులను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి డివిజన్ అధ్యక్షులు శ్రీ అశోక్ యాదవ్ గారు, స్థానిక నాయకులు, కాలనీవాసులు మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, ప్రజల సౌకర్యం దృష్ట్యా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా రోడ్ల అభివృద్ధి ద్వారా రాకపోకలు సులభతరం అవుతాయని, కాలనీలో జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. ప్రజల సహకారంతో భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రాంతాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నాయకులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## హైదర్షా కోట్‌లో డా. ఏ.పి.జే. అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలు

**రాజేంద్రనగర్, విశాల భారతి :** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని గండిపేట్ మండల పరిధిలో హైదర్షాకోట్ ప్రభుత్వ పాఠశాల సమీపంలో భారత రత్న డా. ఏ.పి.జే. అబ్దుల్ కలాం గారి వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి గౌరవప్రదంగా స్మరించుకున్నారు. దేశం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు, భారత యువతకు కలలు కనడం నేర్పిన శాస్త్రవేత్తగా డా. కలాం చిరస్థాయిగా నిలిచారని వక్తలు కొనియాడారు. విజ్ఞాన శక్తితో భారతదేశాన్ని ప్రపంచ వేదికపై నిలబెట్టిన దార్శనికుడిగా, "మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా"గా ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. "పెద్ద కలలు కండి... ఆ కలలను నిజం చేసేందుకు నిరంతరం కృషి చేయండి" అనే ఆయన సందేశం నేటికీ యువతకు స్ఫూర్తినిస్తోందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ 123వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి , సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొని అబ్దుల్ కలాం గారికి వినమ్ర నివాళులు అర్పించారు.

## తెలంగాణ ఫ్యామిలీ రిజిస్టర్ ఏర్పాటు హర్షణీయం



**విశాలభారతి:** తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూ శాఖ ద్వారా జారీ చేసిన జీవో నంబర్ 172 (తేదీ: 25.07.2026) ప్రకారం తెలంగాణ ఫ్యామిలీ రిజిస్టర్ ఏర్పాటు చేయడం రాష్ట్ర ప్రజలకు, ప్రభుత్వ ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరమైన నిర్ణయమని టీఎన్‌జీఓస్ సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డా. ఎస్.ఎం. హుస్సైనీ ముజీబ్ పేర్కొన్నారు. ఈ ఉత్తర్వుల ద్వారా కుటుంబ సభ్యుల వివరాలు ఒకే ధ్రువీకృత రికార్డులో అందుబాటులో ఉంటాయని, దీనివల్ల ప్రభుత్వ సేవలు పొందడంలో పారదర్శకత, సులభతరం మరియు సమయపాలన పెరుగుతాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు వివిధ శాఖల్లో కుటుంబ సభ్యుల ధ్రువీకరణ, వారసత్వ సంబంధిత వివరాలు, ఇతర అధికారిక అవసరాల కోసం ఒకే ధ్రువీకృత పత్రాన్ని వినియోగించుకునే అవకాశం కలుగుతుందని ముజీబ్ వెల్లడించారు. అలాగే సాధారణ ప్రజలకు కూడా కుటుంబ సభ్యుల వివరాల కోసం పలుమార్లు వివిధ ధ్రువపత్రాలు సమర్పించాల్సిన అవసరం తగ్గి, మీ సేవ కేంద్రాల ద్వారా త్వరితగతిన ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికేట్ పొందే అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రజాహిత నిర్ణయం తీసుకున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారికి, రెవెన్యూ శాఖ మంత్రివర్యులకు, రాష్ట్ర ప్రభుత్వానికి టీఎన్‌జీఓస్ సెంట్రల్ యూనియన్ తరఫున డా. ఎస్.ఎం. హుస్సైనీ ముజీబ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# తోగూడెం అక్రమ మైనింగ్‌పై కలెక్టరేట్ ముట్టడి

- సమగ్ర విచారణ చేసి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి: సేవాలాల్ సేన
- జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం.. భారీ సంఖ్యలో తరలివచ్చిన గిరిజనులు, కార్యకర్తలు

భద్రాద్రి కొత్తగూడెం,(ప్రతినిధి):విశాలభారతి




పాల్వంచ మండలం తోగూడెం గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న అక్రమ మైనింగ్ వ్యవహారంపై సమగ్ర, స్వతంత్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సేవాలాల్ సేన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ)ను ముట్టడించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్, రాష్ట్ర కార్యదర్శి భూక్య శ్రీను నాయక్ మాట్లాడుతూ, ఇదే అంశంపై గతంలో జూన్ 29, 2026న జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, అందుకే ప్రజాస్వామ్యబద్ధంగా కలెక్టరేట్ ముట్టడి చేపట్టాల్సి వచ్చిందని తెలిపారు.

**ప్రభుత్వానికి భారీ నష్టం**

తోగూడెంలో కొనసాగుతున్న అక్రమ మైనింగ్ వల్ల ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల రూపాయల ఆదాయ నష్టం జరుగుతోందని, గిరిజనుల హక్కులు ఉల్లంఘించబడటంతో పాటు సహజ వనరులు, పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటున్నాయని నాయకులు ఆరోపించారు.

**సీజ్ చేసినా మళ్లీ తవ్వకాలే..!**

జిల్లా మైనింగ్ శాఖ అధికారులు ఇప్పటికే తోగూడెం ప్రాంతంలోని క్వారీలను మూడుసార్లు సీజ్ చేసినట్లు ప్రకటించడం ద్వారా అక్రమ మైనింగ్ జరిగిన విషయం స్పష్టమవుతోందన్నారు. అయినప్పటికీ కొద్ది రోజులకే తిరిగి తవ్వకాలు ప్రారంభమవుతున్నాయని, ఇందుకు కారణమైన వారిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

**రాయల్టీలో భారీ గండి**

అసలు తవ్వకాల పరిమాణాన్ని నమోదు చేయకుండా తక్కువగా చూపించి ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీని తగ్గించడం ద్వారా ప్రజాధనానికి భారీ నష్టం వాటిల్లిందని ఆరోపించారు. సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద కోరిన వివరాల్లో వాస్తవాలను దాచిపెట్టి తప్పుడు సమాచారం ఇచ్చారని, దీనిపైనా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**అధికారుల పాత్రపైనా విచారణ జరపాలి**

పర్యావరణ అనుమతులు, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) మార్గదర్శకాలను ఉల్లంఘిస్తూ అక్రమ మైనింగ్ కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడిన వారితో పాటు సహకరించిన అధికారులపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సమర్పించిన వినతిపత్రంలో డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు బోడ రమేష్‌నాయక్, జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్, జిల్లా కార్యదర్శి బాదావత్ సురేష్ నాయక్, జిల్లా ప్రచార కార్యదర్శి జరపల లాలు నాయక్, బట్టు హుస్సేన్ నాయక్, భారతీయ గోర్ బంజారా పోరాట సమితి నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువజన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ట్రాఫిక్ వాలంటీర్లకు రిఫ్రెషర్ శిక్షణ

**రోడ్డు భద్రతపై అవగాహన**



**సైబరాబాద్ విశాల భారతి:** సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ), సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో ట్రాఫిక్ వాలంటీర్లకు రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 60 మందికి పైగా ట్రాఫిక్ వాలంటీర్లు పాల్గొన్న ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర పరిస్థితుల్లో స్పందన, ప్రజల భాగస్వామ్యంపై శిక్షణ ఇచ్చారు.కార్యక్రమానికి అదనపు డీసీపీ (ట్రాఫిక్ 1) హనుమంతరావు, ఎస్‌సీఎస్‌సీ సీఈవో నవీద్, స్ట్రాటజిక్ ఆపరేషన్స్ డైరెక్టర్ రష్మి, రోడ్ సేఫ్టీ అండ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఫోరం జాయింట్ సెక్రటరీ రాజేష్ బాలరాజు, కోలీడ్ రత్న శర్మతో పాటు ట్రాఫిక్ ఫోరం సభ్యులు హాజరయ్యారు.ఈ సందర్భంగా అదనపు డీసీపీ హనుమంతరావు మాట్లాడుతూ "సేఫ్టీ ఫస్ట్" ప్రతి ట్రాఫిక్ వాలంటీర్ ప్రధాన లక్ష్యంగా ఉండాలని సూచించారు. వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగం, ఫ్రీ లెఫ్ట్ ఉల్లంఘనలు, మద్యం మత్తులో డ్రైవింగ్, అతివేగం, శబ్ద కాలుష్యం వంటి ఉల్లంఘనలను గుర్తించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.రాజేష్ బాలరాజు మాట్లాడుతూ ట్రాఫిక్ రద్దీ నియంత్రణలో వాలంటీర్ల పాత్ర కీలకమని, రోడ్డు సూచికలు, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రత్న శర్మ ఐటీ సంస్థలు, ట్రాఫిక్ పోలీసుల మధ్య సమన్వయం పెరగాలని, హెల్మెట్ వినియోగం, రోడ్డు భద్రతపై కార్పొరేట్ సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. త్వరలో కార్‌పూలింగ్ కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ఎస్‌సీఎస్‌సీ సీఈవో నవీద్ మాట్లాడుతూ ముఖ్యంగా వర్షాకాలంలో ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు కార్‌పూలింగ్, దశలవారీ కార్యాలయ సమయాల అమలుకు సంస్థ కట్టుబడి ఉందన్నారు.కార్యక్రమంలో యశోద ఆస్పత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్‌ఎస్), సీపీఆర్ శిక్షణ నిర్వహించగా, ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ అధికారులు ట్రాఫిక్ సంకేతాలు, రోడ్డు భద్రత, వాలంటీర్ల బాధ్యతలపై అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన అంచనా పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ట్రాఫిక్ వాలంటీర్ గుర్తింపు కార్డులు, ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## చెత్త కనిపిస్తే ఫొటో తీసి పంపండి.. చర్యలు తీసుకుంటాం

**అక్రమంగా చెత్త వేస్తున్న వారిపై ఫిర్యాదులకు సీఎంసీ పిలుపు**




**సైబరాబాద్ విశాల భారతి:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజల సహకారం అవసరమని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కోరింది. తమ పరిసరాల్లో ఎక్కడైనా అక్రమంగా చెత్త పారబోస్తున్నట్లు గమనిస్తే వెంటనే ఫొటో తీసి సామాజిక మాధ్యమం **ఎక్స్ (ట్విట్టర్)**లో పోస్టు చేయాలని సూచించింది. పోస్టులో @CMC_Offclను ట్యాగ్ చేయడంతో పాటు ఘటన జరిగిన ఖచ్చితమైన ప్రాంతాన్ని పేర్కొనాలని తెలిపింది. ప్రజలు పంపే ఫొటోలు, వివరాల ఆధారంగా సంబంధిత బృందాలు వెంటనే స్పందించి చెత్తను తొలగించడంతో పాటు అవసరమైన చర్యలు చేపడతాయని సీఎంసీ వెల్లడించింది. ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన సైబరాబాద్ నిర్మాణం సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు. "మీరు ఫొటో పంపండి.. చర్యలు మేము తీసుకుంటాం" అంటూ ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఎంసీ పిలుపునిచ్చింది.

## సెప్టెంబర్ 30లోపు బహదూర్‌పల్లి–కొంపల్లి రోడ్డు విస్తరణ పూర్తి చేయాలి

**ఆగస్టు 15లోగా విద్యుత్ స్తంభాల మార్పిడి పూర్తి చేయాలని మంత్రి డి. శ్రీధర్‌బాబు ఆదేశం**



**సైబరాబాద్ విశాల భారతి:** బహదూర్‌పల్లి-కొంపల్లి రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం దూలపల్లి వద్ద జరుగుతున్న పనులను పరిశీలించిన ఆయన ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష నిర్వహించి, శాఖల మధ్య సమన్వయం పెంచాలని సూచించారు.అటవీ ప్రాంతంలో ఉన్న విద్యుత్ స్తంభాల మార్పిడి పనులను ఆగస్టు 15లోపు పూర్తిచేయాలని, మొత్తం రోడ్డు విస్తరణ పనులను సెప్టెంబర్ 30 నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. దూలపల్లి, బహదూర్‌పల్లి గ్రామాల్లో భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి పనులకు ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుకు అవసరమైన వర్షపు నీటి కాలువ ప్రతిపాదనను హెచ్‌ఎండీఏ సిద్ధం చేసి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సమర్పించాలని సూచించారు. ఈ రహదారి విస్తరణతో ట్రాఫిక్ రద్దీ తగ్గి రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, జోనల్ కమిషనర్, హెచ్‌ఎండీఏ, టీజీఎస్‌పీడీసీఎల్, అటవీ శాఖతో పాటు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సంస్కృతి–సాంప్రదాయాల పరిరక్షణలో డా. మల్లారెడ్డి పెద్దన్న పాత్ర

- అమెరికాలో తెలంగాణ ఉద్యమ కళాకారులతో ఆత్మీయ కలయిక
- పాటలు, పల్లె సంస్కృతి, ఉద్యమ జ్ఞాపకాలతో కళాకారుల సందడి
- తెలంగాణ ఆత్మను విదేశీ గడ్డపై సజీవంగా ఉంచాలని పిలుపు



**విశాలభారతి:** విదేశాల్లో పెరుగుతున్న కొత్త తరానికి తెలంగాణ చరిత్ర, సంప్రదాయాలు, బతుకమ్మ, బోనాలు, జానపద కళారూపాలు, ఉద్యమ స్ఫూర్తిని పరిచయం చేయడంలో డా. పైళ్ల మల్లారెడ్డి పెద్దన్న పాత్ర పోషిస్తున్నారని తెలంగాణ కళాకారులు పేర్కొన్నారు. అమెరికాలో తెలంగాణ సంస్కృతి, భాష, సాహిత్య పరిరక్షణ కోసం పనిచేస్తున్న ప్రవాస సంఘాల సేవలను ఈ సందర్భంగా కళాకారులు అభినందించారు. న్యూయార్క్‌లోని లాంగ్ ఐలాండ్‌లో ప్రముఖ ప్రవాస తెలంగాణవాది లక్ష్మణ్ అనుగు నివాసంలో డా. పైళ్ల మల్లారెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ కళాకారులతో ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా జరిగింది. తెలంగాణ ఉద్యమంలో పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపిన ప్రముఖ కళాకారులు ఒకే చోట కలుసుకోవడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణ రాష్ట్ర సాధనలో కళాకారుల పాత్ర చిరస్మరణీయమని డా. మల్లారెడ్డి పేర్కొన్నారు . ఉద్యమ కాలంలో పాటల ద్వారా ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిన కళాకారులను విదేశీ గడ్డపై కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రవాస తెలంగాణవాసులు తమ మూలాలను మరువకుండా భాష, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అమెరికాలో నివసిస్తున్న తెలంగాణ కుటుంబాలు తమ పిల్లలకు మాతృభాషతో పాటు తెలంగాణ సంస్కృతిని పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కళాకారులతో ప్రత్యక్షంగా మమేకం కావడం ద్వారా యువతలో తెలంగాణ చరిత్రపై మరింత అవగాహన పెరుగుతుందని చెప్పారు. తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (టీటీటీ) అధ్యక్షుడిగా ఎన్నికైన పెద్దిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఉద్యమ సమయంలో జరిగిన అనేక సంఘటనలను గుర్తు చేసుకుంటూ కళాకారులు తమ అనుభవాలను పంచుకోవడం ప్రత్యేక ఆకర్షణ నిలిచింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్, జానపద కళాకారుడు నల్గొండ గద్దర్ నర్సిరెడ్డి, జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ గేయ రచయిత కాసర్ల శ్యామ్, మాజీ ఎమ్మెల్యే, ప్రజా గాయకుడు రసమయి బాలకిషన్, జానపద గాయని యాత సంధ్య పాల్గొన్నారు.

## ఉద్యమ కారుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభించాలి

- ఉద్యమ కారుల అంశాన్ని సామాజిక, రాజకీయ, ఆర్థిక కోణాల్లో చూడాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం విజ్ఞప్తి



**ముషీరాబాద్, విశాల భారతి:** ఉద్యమ కారుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభించి ఉద్యమ కారుల అంశాన్ని సామాజిక, రాజకీయ, ఆర్థిక కోణాల్లో చూడాలని సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం విజ్ఞప్తి చేసింది. తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఆధ్వర్యంలో సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫోరం రాష్ట్ర చైర్మన్ డా. చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తయినా, గత పదేళ్లుగా తెలంగాణ ఉద్యమ కారులను గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించి అన్యాయం చేశారని ఫైర్ అయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమ కారులకు 250 గజాల ఇంటి స్థలం, ₹25,000 పెన్షన్ వంటి హామీలు ప్రకటించారని గుర్తు చేశారు. ఉద్యమ కారుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం గుర్తింపు కమిటీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అయితే ఇకపై సమీక్ష సమావేశాల పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే తెలంగాణ ఉద్యమ కారుల గుర్తింపు ప్రక్రియను ప్రారంభించి, అర్హులైన ఉద్యమ కారులకు గుర్తింపు కార్డులు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా ఆలస్యం చేస్తే, గతంలో కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ కారులను విస్మరించినట్లే ప్రస్తుత ప్రభుత్వం కూడా తమను మరచిపోతుందనే ఆందోళన ఉద్యమ కారుల్లో కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సమావేశంలో ఉద్యమకారులు గుండు దయానంద్, బి. జగన్ యాదవ్,జోగు అంజయ్య,మోకే ప్రసాద్.లక్ష్మీనారాయణ, రాజేష్,.కొండా స్వామి, శివకుమార్ నేత,రాజేందర్,శ్యామల, మంజూష, అనంత లక్ష్మి, నాగజ్యోతి, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సమీక్ష.. అధికారులకు కఠిన ఆదేశాలు




**రాజేంద్రనగర్, విశాల భారతి :** శంషాబాద్ మండల కేంద్రంలోని మండల కార్యాలయంలో అభివృద్ధి పనులపై ప్రత్యేక ప్రగతి సమీక్షా సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై అధికారులతో సమగ్రంగా చర్చించారు. మండల వ్యాప్తంగా కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేసి, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. అభివృద్ధి పనుల్లో ఆలస్యం చోటుచేసుకోకుండా నిరంతర పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, మండల పరిధిలోని గ్రామపంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు విస్తృతంగా పాల్గొన్నారు

## కూకట్‌పల్లి కోర్టులో ఘనంగా బోనాల సంబరాలు

**మహిళా న్యాయవాదుల ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు.. కల్వ మైసమ్మకు ప్రత్యేక పూజలు**

**సైబరాబాద్ విశాల భారతి:** ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కోర్టు ఆవరణలో బోనాల వేడుకలను వైభవంగా నిర్వహించారు. సంప్రదాయ వస్త్రధారణలో మహిళా న్యాయవాదులు రంగురంగుల పూలతో బోనాలను అందంగా అలంకరించి, భక్తిశ్రద్ధలతో తలపై మోసుకొచ్చారు. పోతరాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాలు, భక్తుల జైజైధ్వానాల మధ్య కోర్టు ఆవరణ నుంచి భారీ ఊరేగింపుగా బయలుదేరిన న్యాయవాదులు మల్లికార్జున చెరువు గట్టుపై ఉన్న కల్వ మైసమ్మ ఆలయానికి చేరుకుని బోనాలు సమర్పించారు.అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, న్యాయవ్యవస్థ మరింత బలోపేతం కావాలని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణ భక్తి పారవశ్యంతో కళకళలాడగా, బోనాల శోభను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో న్యాయవాదులు, వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. సురేందర్, ఉపాధ్యక్షులు బి. సత్యనారాయణ, కె. శ్రీదేవి, జాయింట్ సెక్రటరీ సి.హెచ్. ప్రత్యూష రెడ్డి, కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ఇలాంటి వేడుకలు పరస్పర ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.



## వాట్సాప్ ఎకౌంటు బ్లాక్ చేశారు

- నిజాలు రాస్తే వాట్సాప్ అకౌంట్ బ్లాక్ చేస్తారా
- ప్రతి అక్షరం ప్రజల పక్షానే కొనసాగుద్ది
- అన్యాయం పై అక్షరం తిరుగుబాటు ఉంటుంది
- ఎవరెన్ని కుట్రలు చేసిన కలం జ్వలిస్తుంది
- తాటాకు చప్పళ్ళకు భయపడేది లేదు
- జర్నలిస్టు అంటే జనం గుండె చప్పడు
- విశాల భారతి రిపోర్టర్ గడ్డం సుధాకర్ రావు ఆగ్రహం


భద్రాచలం , విశాల భారతి;

జరిగిన సంఘటనలపై నిజం రాస్తే వాట్సాప్ అకౌంట్ ని బ్లాక్ చేసి పై శాచిక ఆనందాన్ని పొందుతున్నారని విశాల భారతి భద్రాచలం రిపోర్టర్ గడ్డం సుధాకర్ రావు పేర్కొన్నారు. అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేరని ఆ నిజం తెలుసుకొని కీచక సన్యాసులు ఉన్నారని ఆయన అన్నారు. నిజాల పైన కలం కదులుతుందని ఎవరెన్ని కుయుక్తులు పన్నిన బెదిరేది లేదని ఆయన వివరించారు. గతంలో కూడా కొన్ని వార్తలను నిర్భయంగా రాసినందుకు కొన్ని పరోక్ష దాడులకు పాల్పడ్డారని ఆయన పేర్కొన్నారు. భయభ్రాంతులకు గురి చేసేలా సంఘటనలు క్రియేట్ చేశారని ఆనాడు పోలీసులకు కూడా ఫిర్యాదు చేసిన ప్రయోజనం లేకుండా పోయిందని ఆయన ఆవేదన చెందారు. ఇక్కడ కూడా నాలాంటి కొంతమంది విలేకరులకు వివక్షత కనిపిస్తుందని ఆవేదన చెందారు. కొన్ని వార్తలు అక్రమార్కులను ఉద్దేశించి రాసినందుకు దానికి పరోక్ష దాడులకు అర్ధరాత్రి పూట దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేశారని అయినా సరే అదరకుండా బెదరకుండా వార్తలు రాసే దాంట్లో రాజీ పడలేదని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం కూడా కొంతమంది కావాలని అక్రమార్కులు నా వాట్సాప్ అకౌంట్ ను బ్లాక్ చేశారని ఆయన తెలిపారు. కొంతమంది నిజాలు రాస్తే వారికి రాచ మర్యాదలు చేస్తున్నారని నాలాంటి వాళ్లు వార్తలు రాస్తే బెదిరింపులు పరోక్ష దాడులకు పూను కుంటున్నారని ఆయన తెలిపారు. ఆనాడు ప్రజా ఉద్యమాల్లో పనిచేసిన తెగువ నాకు ఉన్నదని ఏ దాడికి భయపడేది లేదని ఆయన స్పష్టం చేశారు. అవినీతి అక్రమాల పైన చట్టాల రక్షణ కోసం హక్కుల పరిరక్షణ కోసం కలం గర్జిస్తుందని ఆయన అన్నారు. ఇప్పటికైనా అక్రమార్కుల తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపడం అనేది అవేకమని ఒక కలాన్ని ఆపాలని చూస్తే వేల కలాలు పుట్టుకొస్తాయని అవినీతి అక్రమాల పైన ప్రతిఘటిస్తాయని ఆయన పేర్కొన్నారు.

## మీల్స్‌లో ప్లాస్టిక్ కవర్.. ఫిర్యాదు చేస్తే "మరో ప్లేట్ తీసుకోండి"

# అన్న ఫ్యూయల్ బాక్స్ సిబ్బంది







- మదీనాగూడ రెస్టారెంట్ నిర్లక్ష్యంపై కస్టమర్ల ఆగ్రహం
- ఫుడ్ సేఫ్టీ అధికారుల తీరుపైనా విమర్శలు



సైబరాబాద్ - విశాల భారతి

మదీనాగూడ మైత్రి కమాన్ సమీపంలోని శ్రీకర హాస్పిటల్ లైన్‌లో ఉన్న ఫ్యూయల్ బాక్స్ రెస్టారెంట్‌లో వడ్డించిన మీల్స్‌లో ప్లాస్టిక్ కవర్ ముక్క బయటపడిన ఘటన కలకలం రేపింది. ఆహారం నాణ్యత, పరిశుభ్రతపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారంటూ కస్టమర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి భోజనానికి వచ్చిన ఓ వ్యక్తి మీల్స్‌లో భాగంగా ఇచ్చిన పాయసంలో ప్లాస్టిక్ కవర్ ముక్క కనిపించడంతో ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యాడు. వెంటనే కౌంటర్ వద్దకు వెళ్లి విషయం చెప్పగా, క్షమాపణ చెప్పాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా స్పందించారని బాధితుడు ఆరోపించాడు. "అలా జరిగిందా... మరో ప్లేట్ తీసుకోండి" అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో పాటు, సమస్య తీవ్రతను ఏమాత్రం పట్టించుకోలేదని తెలిపాడు. అంతటితో ఆగకుండా, "ఇది మా వద్ద జరగలేదు... బయట నుంచి ఫుడ్ తెప్పిస్తాం... మా తప్పు కాదు... మేనేజర్‌ను కలవండి" అంటూ బాధ్యతను ఒకరిపై ఒకరు నెట్టేసుకున్నారని బాధితులు వాపోయారు. వినియోగదారుడి ఆరోగ్యానికి సంబంధించిన అంశంలో బాధ్యతాయుతంగా స్పందించాల్సిన రెస్టారెంట్ సిబ్బంది నిర్లక్ష్య ధోరణి అవలంబించడంపై కస్టమర్లు మండిపడ్డారు. పరిశుభ్రత ప్రమాణాలు పాటించకుండా ఆహారం తయారు చేయడం, నాణ్యత నియంత్రణ లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. డబ్బులు పూర్తిగా వసూలు చేసి, అపరిశుభ్రమైన ఆహారం అందించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఇలాంటి ఆహారం తీసుకుంటే వారి ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం, ఇదే రెస్టారెంట్‌పై గతంలో కూడా పరిశుభ్రత, ఆహార నాణ్యత, నిర్వహణలో లోపాలపై పలు ఫిర్యాదులు నమోదయ్యాయి. అయితే సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించి జరిమానాలు, చలాన్లు, పెనాల్టీలు విధించడం వరకే పరిమితమవుతున్నారే తప్ప, పునరావృతమవుతున్న ఉల్లంఘనలను అరికట్టేలా కఠిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హోటల్ యాజమాన్యాలకు భయం లేకుండా పోయిందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఒకవేళ ఫుడ్ సేఫ్టీ అధికారులు కఠినంగా వ్యవహరించి, పదేపదే నిబంధనలు ఉల్లంఘిస్తున్న హోటళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకుని అవసరమైతే లైసెన్సుల రద్దు వంటి చర్యలు చేపట్టి ఉంటే ఇలాంటి ఘటనలు పునరావృతం అయ్యేవి కావని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, రెస్టారెంట్‌లో పరిశుభ్రత ప్రమాణాలు, ఆహార తయారీ విధానాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, వినియోగదారుల ఆరోగ్యంతో నిర్లక్ష్యంగా వ్యవహరించే హోటళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, కస్టమర్లు ఫుడ్ సేఫ్టీ అధికారులను డిమాండ్ చేస్తున్నారు.



# స్పిరిట్‌లో పోలీస్ ఆఫీసర్‌గా..

దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా ఇటీవలే కత్రినాకైఫ్‌ని కలిశారు. 'స్పిరిట్' సినిమాలో ఆమె చేసే క్యారెక్టర్‌ని వివరించారు. కత్రినాకు కూడా ఆ పాత్ర బాగా నచ్చిందనేది బాలీవుడ్ న్యూస్. ఇదిలావుంటే.. అసలు 'స్పిరిట్'లో కత్రినా పోషించే పాత్ర ఏంటి? అనే విషయంపై బీటౌన్‌లో ఆసక్తికరమైన వార్త వినిపిస్తున్నది. ఇందులో కత్రినా పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నదట. 'స్పిరిట్' కాప్ స్టోరీ అని అందరికీ తెలిసిందే. ముఖ్యంగా ద్వితీయార్ధంలో ప్రభాస్ పక్కా వైల్డ్‌గా మాస్ అవతార్‌లో కనిపిస్తారట. ఆ కాంబినేషన్‌లోనే కత్రినా సీన్స్ వస్తాయని వినికిడి. ఇదే కనుక నిజమైతే 11ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత కత్రినా కైఫ్ టాలీవుడ్‌లో చేసే సినిమా ఇదే అవుతుంది. ఈ పోలీస్ యాక్షన్ డ్రామా షూటింగ్ ఇప్పటికే 40శాతం పూర్తయినట్టు దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా ఇటీవలే తెలిపారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.